నాటరు.. నాటినా రక్షించరు!

- నర్సరీల్లోనే చెట్లవుతున్న మొక్కలు
- నాటినవి ఎండిపోతున్న పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

రేగొండ: అడవులను కాపాడాలని, పర్యావరణాన్ని రక్షించాలన్న ప్రభుత్వ లక్ష్యం కొందరి నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది. వాతావరణ సమతుల్యం సాధించాలని గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి.. పెంచి పోషించాలని ఆదేశించినా క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదు. నర్సరీల్లోని మొక్కలు నాటకపోవడంతో అక్కడే వృక్షాలుగా మారుతున్నాయి. నాటిన మొక్కలను కూడా సంరక్షించకపోవడంతో ఎండిపోతున్నాయి. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి వాటిలో మొక్కలు పెంచారు. ముఖ్యంగా అవెన్యూ ప్లాంటేషన్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు ఆదేశాలు ఇచ్చినా.. మొక్కలు నాటేందుకు ఖాళీ స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో చాలా నర్సరీల్లోనే మొక్కలు అలాగే ఉండిపోయాయి. అలాగే గ్రామాల్లో ఈజీఎస్ సిబ్బంది చేత మొక్కలు నాటిస్తున్నారు. కానీ సంరక్షణ విషయంలో ఎలాంటి పర్యవేక్షణ లేదు. దీంతో నాటిన మొక్కలు చాలా వరకూ ఎండిపోతున్నాయి. మరికొన్నింటికీ ట్రీగార్డులు లేకపోవడంతో పశువులు, మేకలు, గొర్రెలకు మేతగా మారుతున్నాయి. ఇంకొన్నింటిని రోడ్ల వెంట నాటగా.. కొంత పెద్దవిగా కాగానే విద్యుత్ లైన్ ఉండటంతో సిబ్బంది వాటిని నరికివేస్తున్నారు. ఇలా పలువురి నిర్లక్ష్యం మొక్కల పెంపకానికి ప్రతిబంధకంగా మారుతుంది. ఇప్పటికైనా అధికారులు బాధ్యతగా వహించి మొక్కలను నాటించి సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తిరుమలగిరి నర్సరీలో ఉన్న మొక్కలు



సుల్తాన్‌పూర్‌లో ఎండిపోయిన మొక్కలు

మొక్కలను సంరక్షించాలి

నాటిన మొక్కలను సంరక్షించాలి. నాటిన తరువాత బాధ్యత లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో కొన్ని ఎండిపోయి, మరికొన్ని పశువులు, మేకలకు ఆహారంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు జాగ్రత్తలు తీసుకోని సంరక్షించాలి.

- పెండ్యాల రాజు, రేగొండ

లక్ష్యం కంటే ఎక్కువగానే..

నర్సరీల్లో లక్ష్యం కంటే ఎక్కువగా మొక్కలు పెంచారు. ప్రస్తుతం పండ్ల మొక్కలు సైతం అందుబాటులో ఉన్నాయి. ఎవరికైనా పెంచుకునేందుకు ఆసక్తి ఉంటే మొక్కలు అందజేస్తాం. అంతేకాకుండా కరెంట్ లైన్స్ కింద గన్నేరు మొక్కలు పెంచాలని ఆదేశాలు ఉన్నాయి. దీంతో ఈ సారి వాటిని మాత్రమే నాటించాం.

- రాంప్రసాద్‌రావు, ఎంపీడీఓ, రేగొండ

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం(మహాముత్తారం): మహాముత్తారం మండలం దొబ్బలపాడు తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న పీజీటీ కెమిస్ట్రి పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ షరీఫ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోస్టుకు ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీఈడీ ఫిజికల్ సైన్స్ మెథడాలజీ అర్హత ఉండాలని పేర్కొన్నారు. గంటల ప్రతిపాదికన పని చేయాల్సి ఉంటుందని గరిష్ట వేతనం రూ.18200గా నిర్ణయించినట్లు తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సన్మానం



రేగొండ: మండలంలోని కొడవటంచ ఆలయంలో ఇటీవల నూతనంగా వచ్చిన దేవదాయ ఇన్‌స్పెక్టర్ నందనం కవితను జిల్లాలోని అర్చకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేవాలయాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ధూప దీప నైవేద్యాల పథకం తీసుకోచ్చిందన్నారు. ప్రతీ రోజు అర్చకులు దేవుడి ముందు దీపం వెలిగించి, నైవేద్యం సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగ దక్షిణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి నంది విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు వెంకటరమణా చార్యులు, ఉపాధ్యక్షుడు నంది శివకుమార్, గౌరవ అధ్యక్షుడు కర్నె సాంబయ్య, అర్చకులు నంది సదానందం, కర్నె సదానందం, మహాదేవ్, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

జీఓను నిలిపేయాలి

కాటారం: అశాస్త్రీయమైన రేషనలైజేషన్ జీఓ 25ను ప్రభుత్వం వెంటనే నిలిపేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూటీఎస్) జిల్లా అధ్యక్షుడు రమేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి గణేశ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఎన్నో ఏళ్లుగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు కోరుతుంటే ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య పరంగా ఉపాధ్యాయులను నియమించాలని ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంతో సంబంధం లేకుండా ప్రతి 20 మంది విద్యార్థులకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. అవసరమైన పాఠశాలల్లో ఖాళీలను విద్యా వలంటీర్లతో భర్తీ చేయడంతో పాటు డీఎస్సీ నియామకంతో పూర్తి స్థాయి ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని తెలిపారు.

తాగునీటి సహాయకులకు శిక్షణ



కాటారం: మిషన్ భగీరథ నీటి సరఫరాలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం మండలంలోని గ్రామ పంచాయతీలకు చెందిన తాగు నీటి సహాయకులకు శిక్షణ కల్పించారు. నీటి సరఫరాలో పాటించాల్సిన నిబంధనలు, ప్లంబింగ్, ఇతరాత్ర అంశాలపై ప్రత్యేక శిక్షకులు వారికి వివరించారు. స్థానిక మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక్షంగా రిపేర్లు, పలు అంశాలను గురించి తెలిపారూ నీటి సరఫరాలో ఏమైనా లీకేజీలు ఉంటే మంచినీటి సహాయకులే చేసుకోవాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, మిషన్ భగీరథ డీఈఈ రమేశ్, ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, ఏఈఈలు రాజశేఖర్, కళ్యాణ్ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పాలన సాగించాలి



మాట్లాడుతున్న సాయిలు

రేగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్టీలకు అతీతంగా పాలనను కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బంధు సాయిలు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీపీఎం మండల నాయకుడు గుర్రం దేవేందర్ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఎన్నికలకు ముందు జీరో అకౌంట్ ఖాతాదారులకు రూ.15 లక్షలు వారి ఖాతాలో వేస్తానని నమ్మబలికారన్నారు. వామ పక్షాలు ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి సాధించుకున్న అటవీ హక్కు, సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ చట్టాలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బ్రిటీష్ కాలం నుంచి కార్మికులు అనేక పోరాటాలు చేసి 49 కార్మిక చట్టాలు సాధించుకుంటే వాటిని నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసమస్యలు, సకలజనుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పరిపాలన కొనసాగించాలని తెలిపారు. గ్రామాల్లోని సమస్యల మీద దృష్టి సారించి వాటిని పరిష్కరించే విధంగా పాలన కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడెం శంకర్, సాయిని ఆదిరెడ్డి, రాలేంక కుమార్, గ్రుం మంజుల, శిరిమిల లావణ్య పాల్గొన్నారు.

గుర్రం జాషువా జయంతి వేడుకలు



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లక్ష్మయ్య, తదితరులు

కాటారం: పద్మభూషణ్ డాక్టర్ గుర్రం జాషువా జయంతి వేడుకలను మండల కేంద్రంలో సారస్వత సమితి ఆధ్వర్యంలో, ధన్వాడ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కళాప్రపూర్ణ జాషువా అందించిన తెలుగు సాహిత్య సేవలను కొనియాడారు. సాహిత్యం ప్రజల పక్షం వహించాలని, వర్తమాన కవులకు, రచయితలకు జాషువా స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. జాషువా సాహితీ ప్రభంజనంగా వెలుగొందిన ధృవతార అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సారస్వత సమితి వ్యవస్థాపకులు గడ్డం లక్ష్మయ్య, కవి రచయితలు కట్కూరి సత్యనారాయణ, మోహన్, సుమన్, ఉపాధ్యాయులు చినాల శ్రీనివాస్, శరత్‌బాబు, పర్వీన్, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



డీఎస్పీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కాటారం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు, మండలంలోని గంగారం మోడల్ స్కూల్‌లో శనివారం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ప్రతీ వ్యక్తి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానంలో నిలిచి తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు డీఎస్పీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం



ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు

మల్హర్: విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ చాలా అవసరం అని ప్రిన్సిపాల్ విజయదేవి అన్నారు. మండల కేంద్రం స్థానిక తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ విజయదేవి అధ్యక్షతన ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విజయ దేవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకూడదని సూచించారు. అనంతరం జరిగినటువంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు చేసిన నత్యాలు చూపరులను ఎంతగానో ఆకర్షించాయి. తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం సందర్శించారు. ఈ మేరకు కలెక్టర్‌ను అధ్యాపకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, తాడిచర్ల జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మల్క భాస్కర్‌రావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

‘అగ్నివీర్’పై విద్యార్థులకు అవగాహన

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఎయిర్ ఫోర్స్ అఫీషియల్ కార్పోరల్ సందీప్ అగ్నివీర్ పథకం గురించి అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, అగ్నివీర్ వాయు సేనలో చేరుట గురించిన అంశాలను అర్హతలను ఎంపిక పద్ధతిని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ కార్యక్రమంలో ఇచ్చిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యుగేందర్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసే వేదిక కళాఉత్సవ్

రేగొండ(కొత్తపల్లిగోరి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే మంచి వేదిక కళాఉత్సవ్ అని కొత్తపల్లిగోరి మండల ఎంఈఓ ఓంటేరు చంద్రశేఖర్ అన్నారు. శనివారం కొత్తపల్లిగోరి జిల్లా పరిషత్ పాఠశాలలో మండలంలోని మూడు ఉన్నత పాఠశాలలోని 9, 10వ తరగతి విద్యార్థులకు కళాఉత్సవ్–2024 పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కొత్తపల్లిగోరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత, చిన్నకోడేపాక ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



గౌడ కులస్తులకు రక్షణ కవచాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కుందూరుపల్లి, జవహర్ నగర్ కాలనీ, ఆకుదారివాడ, సీఆర్‌నగర్, పుల్లూరు రామయ్యపల్లి గ్రామాల్లో టీయూఎఫ్ఐడీసీ నిధులతో నూతనంగా నిర్మించనున్న సైడ్ కాల్వల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం జవహర్‌కాలనీ వాసులు స్మశాన వాటిక, డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ స్మశాన వాటిక, డ్రెయినేజీ పనులకు సంబంధించిన నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

గీత కార్మికులకు రక్షణ కవచాల పంపిణీ..

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శైలజ ఆధ్వర్యంలో శనివారం కల్లుగీతా కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై 75 మంది లబ్ధిదారులకు కాటమయ్య రక్షణ కవచాల పంపిణీ చేశారు. త్వరలో మిగిలా లబ్ధిదారులకు కవచాలను పంపిణీ చేస్తామని ఎక్సైజ్ శాఖ అధికారులు వివరించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలతో విద్యార్థినులు

కాటారం: మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయినులు పూలు సేకరించి స్వయంగా బతుకమ్మలు పేర్చారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. కాటారం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఉమారాణి వేడుకల్లో పాల్గొని బతుకమ్మ ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు వివరించారు. అందమైన బతుకమ్మలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వలుస వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వలుస వందన పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారుల్లో ఎనలేని ప్రతిభ



టీషర్టులు అందజేస్తున్న శ్రీనుబాబు, నాయకులు

కాటారం: గ్రామీణ క్రీడాకారుల్లో ఎనలేని క్రీడా ప్రతిభ దాగి ఉంటుందని వారు సత్తా చాటడానికి టోర్నమెంట్‌లు ఎంతగానో దోహదపడుతాయని శ్రీపాద ట్రస్టు చైర్మన్, కాంగ్రెస్ యూత్ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. మండలంలోని ధన్వాడలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీపాద స్మారక డీపీఎల్–9ను శనివారం శ్రీనుబాబు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి టీ షర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, నాయకులు తెప్పెల దేవేందర్‌రెడ్డి, అంగజాల అశోక్, చీర్ల తిరుపతిరెడ్డి, చిటూరి మహేశ్, టోర్నీ నిర్వాహకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయులు

చిట్యాల: విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాల (మోడల్ స్కూల్)లో ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం తెలుపుతూ ఇక్కడి నుంచి వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమేశ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు బదిలీలు సహజం అన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదవి సమాజానికి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, వాణి, సమీరా నిషాత్, దేవి, రాజు, ప్రసాద్, దివ్య ఎండి కలీం, ఫిజికల్ డైరెక్టర్ సమ్మయ్య, శ్రీకాంత్, ప్రసన్న, రామస్వామి, రాణి, సుధీష్ణ, మధునయ, సుగుణ పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

మంగపేట: తాడ్వాయి మండలంలోని దామెరవాయి అటవీ ప్రాంతంలో ఈనెల 26న విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ అధికారులపై విచక్షణా రహితంగా దాడిచేసి గాయపరిచిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని తుడుందెబ్బ మండల అధక్షుడు డబ్బుల ముత్యాలరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా అడవిలో చెట్లను ధ్వంసం చేస్తున్న జేసీబీని స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలిస్తున్న క్రమంలో ఎఫ్ఎస్ఓ వినోద్, బీటాఫీసర్ శరత్‌పై దాడి చేసి హతమార్చేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. దాడికి పాల్పడిన దుండగులను వెంటనే అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో మహిళ మృతి

టేకుమట్ల: అనారోగ్యంతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని గర్మిళ్లపల్లిలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్మిళ్లపల్లికి చెందిన సాతుకు సంధ్య(38) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. కాగా, ఆర్ఎంపీ వద్ద శనివారం చికిత్స చేసుకుని చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు భర్త రాజయ్య తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం



భూపాలపల్లి రూరల్: పోషణ మాసంపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు



కాటారం: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శివరాణి

భూపాలపల్లి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి (ఎస్ఎం) అంగన్‌వాడీ కేంద్రం టీచర్ విలాసరాణి ఆధ్వర్యంలో పోషణ మాస ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్ సునీత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల పిల్లల వరకు ప్రతి నెల క్రమం తప్పకుండా పిల్లల బరువు, ఎత్తు కొలతలు తీసుకొని రికార్డు చేయాలన్నారు. అదేవిధంగా పోషకలోపాలున్న పిల్లలను గుర్తించి ఆ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించడం లేదా అదనంగా ఆహారం తీసుకునే విధంగా చర్య తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మహిళలతో పోషణ్ మాసంపై ప్రతిజ్ఞ చేయించారు. బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి

కాటారం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే రక్తహీనత, ఇతరాత్ర వ్యాధులు దరిచేరవని సీడీపీఓ రాధిక అన్నారు. మండలంలోని అంకుషాపూర్‌లో పోషణ మాసంలో భాగంగా సూపర్‌వైజర్ శివరాణి ఆధ్వర్యంలో పూర్వ బాల్య దశ, సంరక్షణ విద్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, రక్తహీనత నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రీ స్కూల్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకుంటే శరీరానికి సరైన స్థాయిలో పోషకాలు అంది సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని తెలిపారు. పిల్లలకు ప్రీ స్కూల్ విద్య ఎంతో అవసరం అని అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన విద్యా విధానాలతో పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు షహేదా బేగం, శ్రీలత, హైమావతి పాల్గొన్నారు.

మధు పర్యవేక్షణలో యోగా టీం ప్రతిభ



బ్రాంజ్ మెడల్ సాధించిన జట్టుతో కోచ్ మధు

కాటారం: డీఎస్పీ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎడ్ల మధు కోచ్‌గా వ్యవహరిస్తున్న తెలంగాణ రాష్ట్ర పోలీస్ టీం ఆల్ ఇండియా పోలీస్ యోగా చాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబర్చింది. ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 23న నిర్వహించిన ఆల్ ఇండియా గేమ్స్‌లో మధు పర్యవేక్షణలో తెలంగాణ పోలీస్ యోగా టీం బ్రాంజ్ మెడల్ సాధించింది.